వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 30 జనవరి 2025

## 1న సిఎం చంద్రబాబు సంబేపల్లి రాక

### ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రభాతవార్త బ్యూరో కడప

ఫిబ్రవరి ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబేపల్లికి రానున్నారు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సంబేపల్లిలో పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. ముందుగా ఫిబ్రవరి 5న షెడ్యూలు ఉండగా అంతకన్నా ముందే జిల్లా పర్యటనకు వస్తున్నట్లు సమాచారం అందించి. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణతో సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను పలు కార్యక్రమాలలో పాల్గొంటారు సీఎం పర్యటన కోసం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇందుకోసం జిల్లాలో ఇప్పిటికే తగు ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిసింది. సిఎం రాకకోసం హెలీప్యాడ్లు, మొదలగు ఏర్పాట్లు అధికా రులు సన్నద్ధం చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు హౌసింగ్ అండ్ డ్రామా పీడీలు తదితర అధికారులు పాల్గొన్నారు

## గానుగరోలు భలే..భలే

రామసముద్రం, జనవరి 29 ప్రభాతవార్త :



ప్రజల జీవన విదానంలో ప్రముఖమైన పనిముట్లు ఎన్నో ఉన్నా చిరకాలంగా గుర్తిండిపోయేవాటిలో గానుగరోలు ఒకటి. మన ముత్తాతల కాలంలో ఈ గానుగరోలు ప్రాధాన్యత సంతరించుకొంది. గానుగమానుకు కాడెద్దులు కట్టి ఈరోలులో సహజ సిద్ధమైన నూనెగింజలు వేసి నూనె తీసే వారు. తలకు రాసుకొని కుంకుడు కాయలు, సీకాయ, ఆముదం, ఈ రోలు నుండే తీసే వారు. ఈ నెనెలు కల్తీలకు తావులేకుండా ఆరోగ్య కరంగా ఉండేవి. వేప,కానుగ గింజలు ఈ రోలులో వేసి నూనె తీయ్యడమేకాక వాటి చెక్కను వ్యవసాయ భూమికి ఎరువులుగా ఉపయోగించే వారు. ఈ రకమైన ఎరువులు వల్ల పంటలు అధిక దిగుబడులు రావడమేకాక పంటను చీడల నుంచి కాపాడేవి. ఈ ఎరువులను ఉపయోగించి పండించిన పంటలు ఆరోగ్యకరమైనవిగా ఉండేవి. అంతేకాక ఈ గానుగరోలులో స్వచ్ఛమైన వేరుశెనగ నూనె లభించేది. ఇంత ప్రాముఖ్యత కలిగిన పురాతన పనిముట్లు నేడు కనుమరుగయ్యాయి.

### ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న పెద్దిరెడ్డి

# ఆ భూములు ప్రభుత్వానికి అప్పగించాలి

- పెద్దిరెడ్డి పేరు మీద ఉన్న పేదల భూములు ప్రజలకు పంచిపెట్టాలి
- అటవీ సంపదను దోచుకున్న పెద్దిరెడ్డిని ప్రజలు సహించరు
- ప్రభుత్వ భూములు ప్రభుత్వానికి స్వాధీనం చేయకపోతే చట్టపరమైన చర్యలు
- రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి, జనవరి 29: ప్రభాతవార్త

గతంలో మంత్రిగా పనిచేస్తూ ప్రభుత్వ భూములు, అడవి భూములు ఆక్రమించుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరిగి ఆ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గతంలో అటవీ శాఖ మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేల ఎకరాల పేద ప్రజల భూములు, అటవీ భూములు అటవీ సంపదను దోచుకోవడం జరిగిందని ఇవన్నీ తిరిగి ప్రభుత్వానికి అప్పగించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన కుమారుడు గతంలో చేసిన అక్రమాలు అన్యాయాలు వెలకట్టలేనివని ఇప్పుడు వాటిని బయటకు తీసే సమయం వచ్చిందన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తంబళ్లపల్లె మదనపల్లె నియోజకవర్గం మరియు పుంగనూరు తిరుపతిలో ఎక్కడ చూసినా వేలాది ఎకరాల భూమిని దొంగ రికార్డులు సృష్టించి కబ్జా చేయడం జరిగిందన్నారు. పెద్దిరెడ్డి భార్య పేరు మీద మదనపల్లెలో ఐదు ఎకరాల చెరువును కబ్జా చేసి ఆమె పేరు మీద ఎక్కించడం జరిగిందన్నారు. ప్రపంచానికే తలమానికమైన తిరుపతిలో మఠానికి సంబంధించిన భూములు వారి చేతిలోకి తీసుకొని అధికారులను బెదిరించి నాలుగు ఎకరాలలో కళ్యాణమండపం, 9 ఎకరాలలో విలాసవంతమైన ఇల్లు కట్టించడం జరిగిందన్నారు. తిరుపతి రేణిగుంట శ్రీకాళహస్తి పరిధిలో వందలాది ఎకరాలు ట్యాంపరింగ్ చేసి దొంగ రికార్డులు సృష్టించి తమ పేరు మీద రాయించుకున్నారన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి కుమారుడికి ఎంపీ, ఎమ్మెల్యేల పదవులు ఉన్నాయి. మీరు నీతి నిజాయితీ పరులైతే ఇప్పటికైనా ప్రభుత్వానికి సంబంధించిన అటవీ భూములు, మఠానికి సంబంధించిన సంబంధించిన భూములు, ప్రభుత్వానికి అప్పగించకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తప్పమన్నారు. గతంలో ఇసుకను కర్ణాటక, తమిళనాడుకు తరలించి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకోవడం జరిగిందన్నారు. అప్పట్లో చేసిన అరాచకాలు అక్రమాలు నేడు ఒక్కొక్కటిగా బయటకి వస్తున్నాయని గత ఐదు సంవత్సరాల పరిపాలనలో ఎక్కడ చూసినా అరాచకాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి వారి సొమ్మును దోచుకోవడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో 100 ఎకరాలలో ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎస్టేట్ గురించి పరిశీలిస్తే డాక్యుమెంట్ ప్రకారం వారి పేరు మీద కేవలం 26 ఎకరాలు మాత్రమే ఉందని దొంగ రిజిస్టర్ల ప్రకారం సుమారు 100 ఎకరాల భూమి కబ్జా చేసి కాంపౌండ్ వాల్ కట్టుకున్నారన్నారు అక్కడ విలాసవంతమైన గెస్ట్ హౌస్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అవసరాలకు సంబంధించి ఫారెస్ట్ భూమి అవసరమైతే తప్పకుండా అటవీ శాఖ అధికారుల పర్మిషన్ ఉండాలన్నారు. కానీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అలాంటిది పరిమిషన్లు ఏమీ లేకుండా అటవీ శాఖ అధికారులను బెదిరించి వేల ఎకరాల అటవీ భూములను దోచుకోవడం జరిగిందన్నారు. ఎంతోమంది పేదల భూములను దోచుకున్న పెద్దిరెడ్డి తిరిగి ఆ భూములను ప్రభుత్వానికి అప్ప చెప్పకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి హెచ్చరించారు.

## ప్రజాదర్బార్ కార్యక్రమంలో 256 దరఖాస్తులు

### ప్రజాదర్బార్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



చిన్నమండెం, జనవరి 29 ప్రబాతవార్త :

ప్రజాదర్బార్ కార్యక్రమంలో 256 దరఖాస్తులు వచ్చాయని అధికారులు అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చిన్నమండెం మండలం, బోరెడ్డి గారిపల్లెలోని మంత్రి నివాసం నందు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాదర్బార్ కార్యక్రమంలో సమస్యలు పెరుగుతున్నాయని అధికారులు ప్రజల అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నేడు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో 256 అర్జీలు రాగా అందులో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. రెవెన్యూ అధికారులు భూ సమస్యల నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజులలో రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ప్రజల సమస్యలపై ప్రత్యక శ్రద్ధ చూపాలన్నారు.

## సిసిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

### 30 సంవత్సరాల కల నెరవేరింది



రాయచోటి, జనవరి 29 ప్రభాతవార్త

ఎగువ ఇందుకూరుపల్లెలో పండుగ వాతావరణంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ప్రజలు సరైన రోడ్లు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారని నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, వేసి గ్రామాలకు నూతన శోభ తీసుకురావడం జరుగుతోందన్నారు. గత 30 సంవత్సరాలుగా ఎగువఇందుకూరు ప్రజలు సరైన రోడ్డు లేక వాహనదారులు, పాదచారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని నేటితో ఇందుకూరు గ్రామ ప్రజల కల నెరవేరిందన్నారు. రాయచోటి మండలం దిగువ అబ్బవరం గ్రామం, దిగువపాత హరిజనవాడ నుంచి ఎగువ ఇందురు వరకు దాదాపు 49 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రజలు భారీగా హాజరై మంత్రివర్యులకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. గతంలో ఎవ్వరు చేయని విధంగా కనీ, వినీ ఎరుగని రీతిలో మంత్రి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి ఏ గ్రామానికి వెళ్లినా విశేష సంఖ్యలో ప్రజలు హాజరై నీరాజనాలు పలుకుతున్నారు.

### ఆయుధాల పనితీరుపై

# పరిజ్ఞానం పెంచుకోండి

**కడప జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్**

**ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొని, ఆయుధాల నైపుణ్యాలను పరీక్షించిన జిల్లా ఎస్పీ .**



కడప జనవరి 29 ప్రబాతవార్త :

పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కడప జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కడప నగర శివార్లలోని ఫైరింగ్ రేంజ్‌లో ఎ.ఆర్ పోలీసు సిబ్బందికి మొబిలైజేషన్లో భాగంగా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపియస్ బుధవారం ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఏ.కె 47, మసాడా, గ్లాక్ పిస్టల్‌ల ద్వారా జిల్లా ఎస్పీ ఫైరింగ్ సాధన చేశారు. వజ్ర వాహనం నుండి గ్యాస్ షెల్స్ ఫైరింగ్ చేసి పరిశీలించారు. ఆయుధ నైపుణ్యాలను పరీక్షించారు. ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పోలీసులు విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ చేయించారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు. అధికారులు, సిబ్బందికి ఫైరింగ్ గురించి జిల్లా ఎస్పీ దిశా నిర్దేశ చేశారు. ఫైరింగ్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని మంచి మెళకువలు నేర్చుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు. అత్యవసర సమయాలలో ప్రజల మాన, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ బి. రమణయ్య, ఎ.ఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్.ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, టైటాస్, ఆర్.ఎస్.ఐలు పాల్గొన్నారు.

## కార్పొరేటు స్థాయిలో ప్రభుత్వ పాఠశాల



పులివెందుల, జనవరి 29, ప్రభాతవార్త :

కార్పొరేట్ స్థాయిలో జిల్లా పరిషత్ హై స్కూల్ ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే సింహాద్రిపురం హైస్కూల్ ఓ మోడల్ గా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.. ప్రభుత్వం అంతకుముందు కామన్ మ్యాన్ కార్పొరేట్ స్కూల్, సైన్స్, ఇంగ్లీష్ ల్యాబ్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పులివెందుల నియోజవర్గ టిడిపి ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, హెచ్.ఎల్.సి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ జోగిరెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టిడిపి నాయకులు రఘునాథరెడ్డి, డీఈఓ శంషుద్దీన్, మండల ప్రత్యేక అధికారి సన్నన్న, ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎమ్మార్వో నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు అరవింద నాథ్ రెడ్డి, పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఈఈ రాజశేఖర్, ఎంఈఓ ఓబులేసు ,హెచ్ఎం ఉమామహేశ్వరి, దాతలు, గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.

## మహా కుంభ మేళా సందర్భంగా ఆర్టీసి బస్సు సర్వీసులు

కడప, జనవరి 29 ప్రభాతవార్త

మహాకుంభమేళ సందర్బంగా ఆర్టీసి వారు కడప డిపో వారు మహా కుంభ మేళాకు 7 రోజుల పాటు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించబడినది . 2.2.2025 వ తేదీన ఉదయం 8.00 గంటలకు వీడియో కోచ్ (2 + 2) పుష్ బ్యాక్ సీట్లు సౌకర్యం కలిగిన సూపర్ లగ్జరీ బస్సు వయా. నాగపూర్, జబలాపూర్, రేవా, ప్రయాగ రాజ్, వారణాసి మీదుగా అయోధ్యకు వెళ్ళి తిరిగి 8.2.2025 వ తేదీన రాత్రి కడపకు చేరును. మహా కుంభ మేళా ప్రత్యేక బస్సు ను ఆన్ లైన్ ద్వారా గాని లేదా బస్టాండ్ యందు రిజర్వేషన్ కౌంటర్ ద్వారా టికెట్ సౌకర్యం పొందవచ్చును. సర్వీస్ నెం. 913000 రాను, పోను టికెట్ ధర ళ్ళి. 10,000/ లు మాత్రమే భోజనం వసతులు భక్తులు చూసుకొనవలెను. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరడమైనది.

### పర్యావరణ సహితంగా

# యురేనియం ప్రాజెక్ట్‌ను నిర్వహించండి

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**

పులివెందుల రూరల్, జనవరి 29, ప్రభాతవార్త :



పర్యావరణ సహితంగా యురేనియం (యు సి ఐ ఎల్) ప్రాజెక్టు ను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం వేముల మండలం తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(యు.సి.ఐ ఎల్) ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సందర్శించి సంబంధిత అధికారులతో ప్రాజెక్ట్ పనులు, ఉత్పత్తులు, ఇతర అంశాలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... గనుల్లో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా భద్రత ప్రామాణాలను పాటించాలన్నారు .ప్రాజెక్టు నిర్వహణ, భద్రతాపరమైన అంశాల్లో ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు. ప్లాంటేషన్ (మొక్కల పెంపకం) కార్యక్రమాన్ని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేపట్టాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. యురేనియం గనుల వల్ల పరిసర గ్రామాలు ప్రభావితం కాకుండా చూడాలన్నారు. అలాగే జిల్లా విపత్తు నిర్వహణ కమిటీతో సమన్వయం చేసుకుంటూ మాక్ డ్రిల్ లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మొదట యు.సి.ఐ.ఎల్ అధికారులు ప్రాజెక్టు పై పిపిటీ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు. యురేనియం ప్రాజెక్టుకు ఏ పల్లెలు దగ్గరగా ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యురేనియం ప్రాజెక్టు (టైలింగ్) వ్యర్థపదార్థాల నిల్వలు, స్టోరేజ్ సామర్థం వంటి అంశాలపై ఆరా తీశారు.300 ఎకరాలలో తుమ్మలపల్లి వ్యాలీలో నూతన వ్యర్థపదార్థాల స్టోరేజ్ ప్రాంతాన్ని గుర్తించినట్లు కలెక్టర్ కు తెలుపగా ఇప్పటి నుంచే సర్వే పనులు మొదలుపెట్టి అందుకు సంబంధించిన పనులు పూర్తి చేయాలన్నారు. రోజుకు ఎన్ని టన్నుల యురేనియం ఉత్పత్తి అవుతుందని అధికారులు అడిగి తెలుసుకున్నారు. అలాగే గనుల్లో ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఎన్ని షిఫ్ట్ లు నిర్వహిస్తున్నారని అధికారులు అడిగి తెలుసుకున్నారు. వెంటిలేషన్, హానికర వాయువులు, అంబులెన్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాసుల రావు,, యుసీఐఎల్ అధికారులు సుమన్ సర్కార్, కిషోర్ భగత్, శ్రీకాంత్, మాతి వన్నన్ సంజయ్ చటర్జీ, పులివెందుల ఆర్డిఓ చిన్నయ్య , ఆర్ అండ్ బి డిఈ మాధవి, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమం

చిట్వేలి, జనవరి 29, ప్రభాతవార్త:



వ్యవసాయంలో విద్యను అభ్యసించిన చివరి ఏడాది (4వ) విద్యార్థులకు గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమాన్ని మండల పరిధిలోని పోలోపల్లి సచివాలయం వద్ద బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసోసియేట్ మరియు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి టి శ్రీనివాస్, డాక్టర్ జి సందీప్ నాయక్, వైయోహన్ వీరేష్ కుమార్ లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పూల మొక్కలు ముఖ్యంగా రోజా, చామంతి పంటల వలన వచ్చే ఆదాయం మరియు విలువ ఆధారిత ఉత్పత్తులు గురించి వివరించారు. డాక్టర్ కేఎం యువరాజు మాట్లాడుతూ నిమ్మ తోటలో ఎండుకుళ్ళు తెగుళ్ళ, మామిడిలో అధిక దిగుబడులు కొరకు తీసుకోవలసిన చర్యలు వివరించారు. బొప్పాయిలో పంట యాజమాన్యం, వైరస్ నియంత్రణ గురించి డాక్టర్ జి సందీప్ నాయక్ వివరించారు. పోలోపల్లి గ్రామ సర్పంచ్, సి కందుల వారి పల్లి పల్లి సర్పంచ్, ఆదర్శ రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల మరియు గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బంది హాజరయ్యారు.

## వాహనంతో సహా శ్రీగంధం స్వాధీనం

పీలేరు జనవరి 29 ప్రభాతవార్త ః

కారుతో సహా శ్రీ గధం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు సంచారదళ నిఘా విభాగం డిఎఫ్ఓ ఎం. గురు ప్రభాకర్ తెలిపారు. తమ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, కల్లూరు గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా మంగళవారం అర్ధరాత్రి పీలేరు వైపు నుండి ఓ కారు వేగంగా రావడానికి గుర్తించామన్నారు. తాము కల్లూరు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండడం గమనించిన ఆ కారు డ్రైవర్ చిత్తూరు మార్గంలోకి దూసుకు వెళ్లాడన్నారు. తాము తమ వాహనంలో ఆ కారును వెంబడించగా అతను కారును కల్లూరు నుంచి సదుం రోడ్డుకు మళ్లించి, కల్లూరు ఎగువ వీధి వద్ద వాహనంలోని వ్యక్తి తన వాహనాన్ని ఆపి చీకట్లో ఫరారి అయ్యాడని అన్నారు. తమిళనాడుకు చెందిన ఫోర్డ్ ఎకోస్పోర్ట్ ను తమ సిబ్బంది తనిఖీ చేయగా అందులో 43 కేజీల శ్రీగంధం 3 బస్తాల్లో తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. కారుతో సహా శ్రీగంధం బస్తాల విలువ సుమారు రూ.5 లక్షలు మతింపు వేయడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఆర్ఓ ఎస్. చంద్రశేఖర్, ఎఫ్.బి.ఓ కె. ప్రతాప్, డ్రైవర్లు ఏ. నందీశ్వరులు, ఏ. సురేష్ రాజు, ప్రొటెక్షన్ వాచర్లు కె. సుబ్రమణ్యం, డి. చరణ్, ఏ. వంశీ తదితరులు పాల్గొన్నారు.

### తల తాకట్టు పెట్టైనా

# హామీలు అమలచేస్తానన్న సీఎం

**భాస్కర్ రెడ్డి కుటుంబం ప్రోద్బలంతోనే విచ్చలవిడిగా మట్కా జూదం**

**రూ. 6వేల కోట్లు పాడా నిధులు ఖర్చు చేసినా పూర్తికాని పనులు**

**నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి**

పులివెందుల, జనవరి 29, ప్రభాతవార్త :



ఎన్నికల సమయంలో ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తల తాకట్టు పెట్టైనా అమలు చేస్తాను అని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారని పులివెందుల నియోజక వర్గ తెదేపా ఇన్చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని తెదేపా కార్యాలయంలో బుధవారం తెదేపా పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీటెక్ రవి మాట్లాడుతూ ప్రస్తుతం ఇప్పటికే ఉచిత గ్యాస్ అమలు చేశాము అని త్వరలో ఉచిత బస్సు,రైతు పెట్టుబడి నిది, తల్లికి వందనం అమలు చేస్తామన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వాస్తవాలు మాట్లాడాలి అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం తగదన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమ్మ ఒడి కూడా మూడుసార్లు ఇచ్చాడని అది కూడా రూ. 1000, రూ.2వేలు తగ్గించి ఇచ్చిన మాట వాస్తవం కాదా అన్నారు. వైయస్ రాజారెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైఎస్ వివేకానంద రెడ్డిలు జూదం మట్కా వంటి వాటికి వ్యతిరేకమని ప్రతిపక్ష నాయకులైన వారిని మెచ్చు కుంటామన్నారు. వైయస్ భాస్కర్ రెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డి కుటుంబం రాకతో పులివెందుల ప్రాంతంలో మక్కా, జూదం పెట్రేగి పోయాయి అన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో సహా వైస్ కుటుంబ సభ్యులందరూ మట్కా బీటర్ డానియల్ తో ఫ్లెక్సీలు వేయించుకునే పరిస్థితికి దిగజారారన్నారు. జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామన్నారు. పాడ కింద రూ.6వేల కోట్ల నిధులు ఖర్చు చేసినా ఒక ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేకపో యారని కనీసం పులివెందుల ప్రజలకు త్రాగునీరు కూడా అందించలేని పరిస్థితికి దిగజారారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వెచ్చిన వెంటనే నక్కలపల్లె సమ్మర్ స్టోరేజ్ వద్ద మరమత్తులు పూర్తి చేశామని ,కెనాల్ కు నీళ్ల ఇచ్చామన్నారు. ట్రాన్స్ ఫార్మర్లు కూడా లేకుండా పోతే షిరిడి సాయి ఎల్ట్రికల్స్‌తో వారితో మాట్లాడి వచ్చేలా చేస్తున్నామన్నారు. గతంలో పనులన్నీ పాడా కింద అమలు చేయడంతో ఇప్పుడు అస్కీమ్ లేనందున పనులు ప్రారంభించడానికి ఆటంకంగా మారుతోందన్నారు. అరటి ధరలు స్థిరంగా ఉన్నాయంటే కూటమి ప్రభుత్వం రావడం వల్లనే అని ప్రజలు బాహాటంగా చెబుతున్నారన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి మాదిరిగా విస్తృత అధికారాలు ఉంటే పులివెందుల పూర్తి రూపు రేఖలు మార్చే వాడినని అన్నారు. ఇప్పటికైనా ఎంపీ అవినాష్ రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాల న్నారు. ఒకవేళ హామీలు నెరవేర్చకపోతే ప్రజలే మమ్మల్ని తిరస్కరిస్తారని వైకాపా నాయకులు గగ్గోలు పెట్టాల్సిన అవసరం లేదన్నారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉంది

బద్వేలు అర్బన్, జనవరి 29 (ప్రభాతావార్త):



వాసవిమాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికార పూర్వకంగానిర్వహిస్తున్నందుకు కూటమి ప్రభుత్వానికి ఆర్యవైశ్యులందరూ రుణపడి ఉంటారని స్టేట్ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్‌డెవలప్‌మెంటు కార్పోరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలోవారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌డూండే రాకేష్, మంత్రి నారా లోకేష్‌ను, ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణదినోత్సవాన్ని అదధికారికంగా నిర్వహించాలని, మేనిఫెస్టోలో పెట్టాలని కోరడం జరిగిందన్నారు. ఆనాడు లోకేష్, చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌ను ఒప్పించి మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పెట్టడం జరిగిందని, మేనిఫెస్టోలో పెట్టడాన్ని అమ్మవారి ఆత్మార్పణదినోత్సవం ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ విధియ తిధినాడు నిర్వహించాలని జీవో నంబరు 181 విడుదల చేసిందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారంగా నిర్వహిస్తున్నామని మేనిఫెస్టోలో ప్రకటించడం మరియు ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు అధికారంలోకి రాగానే అమ్మవారి ఆత్మార్పన దినోత్సవాన్ని పురస్కరించి ఈ నెల 31న అమ్మవారికిపటు వస్త్రాలు స్వయంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేయడం ఎంతో సంతోషకరమని ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు పూర్తిస్థాయిలో ముందు జీవోను అమలు పరిచేందుకు కృషిచేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌డూండే రాకేష్‌కు మరియు కూటమి నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

**వాసవిమాత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తాం:**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో మేరకు ఈ నెల 31వ తేదిన బద్వేలు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిఅమ్మవారికి పలువురు నాయకులతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెల్ఫేర్ అండ్‌డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

## రెవెన్యూ అంశాలపై సమీక్ష

దువ్వూరు, జనవరి 29, ప్రభాతవార్త:



స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల జరిగిన భూ రీ సర్వే సదస్సులు అలాగే రెవెన్యూ సదస్సులపై బుధవారం తహసీల్దార్ అక్బర్ బాషా సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన వీఆర్వోలు, సర్వేయర్లతో మాట్లాడుతూ సదస్సులలో వచ్చిన ధరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రైతులు అందజేసిన వినతిపత్రాలను క్షున్నంగా పరిశీలించి వాటిని రెవెన్యూ రికార్డుల ద్వారా సరి చేసి నివేదికలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ వేణుగోపాల్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## మదిరేపల్లెలో పొలం పిలుస్తుంది




దువ్వూరు, జనవరి 29, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మదిరేపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి పరిశీలించారు. ఈ సంధర్బంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు క్రాసింగ్ పంటలు సాగు చేసే సమయంలో తప్పనిసరిగా ఒప్పందం చేసుకొని ఉండాలని లేనిచో రైతులు నష్టపోతారని తెలిపారు. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

## హౌసింగ్ ఏఈ నియామకం

దువ్వూరు, జనవరి 29, ప్రభాతవార్త:

దువ్వూరు మండలానికి గృహనిర్మాణ శాఖ తరపున అసిస్టెంట్ ఇంజనీర్‌ను జిల్లా హౌసింగ్ అధికారులు బుధవారం నియమించారు. పోరుమామిళ్లలో పని చేస్తున్న ఏఈ రమేష్ బాబును దువ్వూరు హౌసింగ్ ఏఈగా నియమించారు. ఈయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే మైదుకూరు గృహనిర్మాణ శాఖ డీఈగా, ఇంచార్జ్ డీఈగ నియమించారని తెలిపారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఇళ్లు నిర్మించుకోవాలంటే ఈ నెల 30వ తేది లోగా ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 29, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో బుధవారం సుబ్రమణ్యం(35) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు తెలిసింది. గ్రామంలోని ఒక రైతు పొలానికి నీరు అందించేందుకు సుబ్రమణ్యం కూలికి వెళ్లాడు. అక్కడ విద్యుత్ షాక్‌తో మరణించినట్లు తెలుస్తోంది. అతనికి శరీరం పైన విద్యుత్ తీగలు తగిలినట్లు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ శివ శంకర్, ఎస్ఐ వినోద్‌కుమార్‌లు పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

## నేడు మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు

బద్వేలు, జనవరి 29, ప్రభాతవార్త

మున్సిపాలిటీలోని స్వయం సహాయక సంఘాల లోని మహిళా సభ్యుల ఉత్పత్తులను నేడు ఉదయం 10 గం.లకు మైదుకూరు రోడ్డు లోని అన్న క్యాంటీన్ దగ్గర మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ సింహారెడ్డి తెలిపారు. కాబట్టి పుర ప్రజలు మహిళా ఉత్పత్తులైన పట్టు చీరలు, కాటన్ చీరలు, నిత్యావసర వస్తువులు , దీపారాధన వస్తువులు, స్వీట్స్, ఊరగాయలు ,అన్ని రకాల పొడులు , వైర్ బుట్టలు లతో పాటు నాన్ వేజ్ ఊరగాయలు వంటి అన్ని రకాల వస్తువులు సరసమైన ధరలకు లభించునన్నారు. ఈ అవ కాశాన్ని ఉపయోగించుకొని మహిళ ఉత్పత్తులను ఆదరించి మహిళల అభివృద్ధికి సహకరించ వలసినది గా విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

బద్వేల్ అర్బన్ , జనవరి 29 , ప్రభాతవార్త

ఇటీవల అధికమైన రోడ్డు ప్రమాదాలను నివారించేందుకుగాను బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్ ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు ఇందులో భాగంగా ఎన్ హెచ్ వారి సహకారంతో ప్రమాదాలు జరుగు చోటు ప్రత్యేక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగేవాహనాలు నడిపే సమయంలో వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు వహించాలన్నారు. మద్యం సేవించి సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని తదితర జాగ్రత్తలు సూచించారు. కావున హెచ్చరిక బోర్డులను వాహనదారులు ప్రతి ఒక్కరు గమనించి అతివేగాన్ని తగ్గించి నెమ్మదిగా వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యం చేరుకునే విధంగా ప్రతి ఒక్కరు కూడా నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ తో పాటు ఎస్సై శ్రీకాంత్ పలువురు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి 7న లక్షల డప్పులు, వేల గొంతుల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



జమ్మలమడుగు, జనవరి 29, ప్రభాతవార్త:

ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకై సామాజిక పరివర్తకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరప తలపెట్టిన లక్షల డప్పులు వేల గొంతుకలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని పెద్దపసపల మోటు నుంచి డా.బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్నయ్య మాదిగ ఆధ్వర్యంలో డప్పులతో సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మానికింద వెంకటేష్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు కె.ఎన్.రాజు మాదిగలు మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి తక్షణం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాదులో ఫిబ్రవరి 7న జరిగే లక్షల డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అన్నెం చిన్న సుబ్బయ్య యాదవ్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాతయ్య, నరసింహులు, గంగరాజు, తులసీ రాముడు, శీను, కుమార్, ఓబులేసు, గోపాల్, సుబ్బయ్య, నాగరాజు, యంగముని మల్లయ్య రామ పుల్లయ్య, శంకర్, చంద్రశేఖర్, సుబ్బయ్య, దిబ్బయ్య, నాగ సుబ్బరాయుడు, తిరుపాలు, వెంకట సుబ్బయ్య, చిన్నన్న, పుల్లయ్య, లక్ష్మీ నారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా వారోత్సవాలు



జమ్మలమడుగు, జనవరి 29, ప్రభాతవార్త:

రోడ్డు భద్రతా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం జమ్మలమడుగు ఎస్‌డీపీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జమ్మలమడుగు టౌన్‌లో ఉన్న స్కూల్స్ మరియు కాలేజీ డ్రైవర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. హెల్మెట్‌లతో మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు అర్బన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.లింగప్ప, ఎస్సై రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినులకు చలి కోట్లు పంపిణీ

పోరుమామిళ్ల రూరల్, జనవరి 29 ప్రభాత వార్త:

స్థానిక పోరుమామిళ్లలోని చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న 274 మంది బాలికలకు సంస్థ వ్యవస్థాపకులు చిత్తా తోమాస్ రెడ్డి, డాక్టర్. గీతా దంపతులు బుధవారం ఉచితంగా చలి కోట్లను పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధి ప్రసాద్ రెడ్డి, జి శ్రీకాంత్ రెడ్డిలు విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ హాస్టల్లో ఉండి చదువుచు చలికాలంలో ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో ఈ చలి కోట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినిలు, విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైసిపి యువ నేత జనసేన పార్టీలోకి

పీలేరు, జనవరి 29 ప్రభాకర్ ః



కలికిరి మండలం కలికిరి పట్టణానికి చెందిన గత ఐదు సంవత్స రాలుగా కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబరుగా చురుకైన పాత్ర పోషించడమే కాకుండా యువనాయకుడిగా బ్రాహ్మణ సంఘానికి వెన్ను దన్నుగా నిలిచిన కలికిరి అజయ్ కుమార్ శాస్త్రి రాష్ట్ర రాజధాని విజయవాడలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరులు నాగబాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల అన్నికులాల వారికి పార్టీలోనే కాకుండా ఎంతో ప్రాధాన్యత కల్పించి బ్రాహ్మణ వారికి సైతం పార్టీలో పదవులు కల్పించి కుల మతాలకు అతీతంగా రాష్ట్ర అభివద్దికి తోడ్పాటు అందిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ పట్ల ఆకర్షితులై ఆపార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా త్వరలోనే మండలాల్లో జనసేన పార్టీ బలోపేతానికి నావంతు కషిచేస్తానని కూటమి ప్రభుత్వంలో భాగంగా రాబోయే పాలనలో అన్ని కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేసేందుకు కషి చేస్తానని ఆయన అన్నారు.

## సబ్ జైళ్లు తనిఖీ

కడప లీగల్, జనవరి 29, ప్రభాతవార్త:

ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ బుధవారం కమలాపురం, జమ్మలమడుగు, మరియు ప్రొద్దుటూరు సబ్ జైళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ 15100పై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైలు సూపరింటెండెంట్లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

## వెల్లాల దేవస్థానంనకు వేలంద్వారా 17.5 లక్షల ఆదాయం

రాజుపాళెం,జనవరి29,ప్రభాతవార్త.

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో బుదవారం ఇ ఓ, కె.వి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో రూ.17లక్షల 50వేలు ఆదాయం వచ్చినది. పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవస్వామి, శ్రీసంజీవరాయస్వామి, శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించి ఒక ఏడాదిపాటు తలనీలాలు, టెంకాయలు అమ్ముకొనుటకు, పూజాసామాగ్రి, కొబ్బరిచిప్పల సేకరణకు నిర్వహించిన వేలపాటలో పలువురు పోటి పడ్డారు.వేలంపాట పోటీలో తలనీలాల సేకరణకు రూ.9లక్షల 55వేలు, టెంకాయలు అమ్ముకొనుటకు రూ.5లక్షల30వేలు, పూజా సామాగ్రి కి రూ2లక్షల 25వేలు,కొబ్బరి చిప్పల సేకరణకు రూ.40 వేలు వేలంపాట ద్వారా దేవస్థానంనకు ఆదాయం వచ్చినట్లు ఇ.ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, జి.యల్.నారాయణరెడ్డి, రామ్మోహన్, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.



## కుల వివక్షకు పాల్పడితే క్రిమినల్ చర్యలు



కలికిరి, జనవరి 29, ప్రభాతవార్త:

మండలంలోని గ్రామ పంచాయతీలలో ఎవరైనా అగ్రకులస్థులు ఎస్సీ, ఎస్టీల పట్ల కులవివక్ష చూపిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ మహేశ్వరీభాయ్ పేర్కొన్నారు. బుధవారం పత్తేగడ పంచాయతీకి చెందిన తెల్లగుట్ట హరిజనవాడలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడైనా అగ్ర కులస్థులు ఆలయాలలోకి ఎస్సీ, ఎస్టీలను రానియ్యకుండా తదితర చర్యలు చేపడతే అధికారుల దృష్టికి తేవాలన్నారు. అలాగే తమ పిల్లలను ప్రతి ఒక్కరు చదివించుకోవాలన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం, పేరు ప్రతిష్టలు పెరుగుతాయన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఏఎస్సై మధుసూదనాచారి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వరాదన్నారు. తమ పిల్లలను ఇంట్లో సక్రమమైన మార్గంలో పెంచితే సమాజానికి సేవ చేసినట్లు అని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని ఏఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్, వీఆర్వో రెడ్డిరాణి, మాజీ జడ్పీటీసీ మాలతి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు గద్దం ఏసురాజు, మర్రికుంటపల్లె సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, మానిటరింగ్ సభ్యులు కె.అగస్తీశ్వర్, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మండలంలో పింఛన్ల పంపిణీ బృందం పర్యటన

కలికిరి, జనవరి 29, ప్రభాతవార్త:



మండలంలోని పల్లవోలు, చీకటిపల్లె, మేడికుర్తి, మర్రికుంటపల్లె, పత్తేగడ పంచాయతీలలో పింఛన్ల తనిఖీ బృందం పర్యటించారు. గ్రామాల్లో మంచానికే పరిమితమై ప్రభుత్వం నుంచి రూ.15వేలు పింఛను పొందుతున్న పింఛనుదారుల ఇంటింటికి డాక్టర్ల బృందం వెళ్లి వారి స్థితిగతులను ప్రభుత్వం మంజూరు చేసిన పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, సచివాలయ సిబ్బంది, డాక్టర్ల బృందం పాల్గొన్నారు.

## పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరు

కలికిరి, జనవరి 29, ప్రభాతవార్త:

మండలంలోని పత్తేగడ పంచాయతీ తెల్లగుట్ట హరిజనవాడలో బుధవారం తహసీల్దార్ మహేశ్వరీభాయ్ ఆధ్వర్యంలో జరిగిన పౌరహక్కుల దినోత్సవానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు, వ్యవసా, పశు,వైద్యశాఖ, దేవాదాయశాఖ అధికారులు హాజరుకావాల్సి ఉంది. ఈ దినోత్సవ కార్యక్రమంలో సంబంధిత శాఖల నుంచి ఎస్సీ, ఎస్టీల సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలన్నది జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాలు. కానీ పలువురు అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. ఇకనైనా జరగనున్న సమావేశాలకు సంబంధిత అధికారులు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## తల్లీ కుమార్తెలు అదృశ్యం - కేసు నమోదు

కలికిరి, జనవరి 29, ప్రభాతవార్త:

కలికిరి పంచాయతీ టీబీ రోడ్డులో నివాసం ఉన్న సేక్ సర్దార్ భార్య ముగిసిర కుమార్తె జకీయా ఫాతిమాలు ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యారు. ఎంత వెతికినా ఆచూకీ లేక బుధవారం ఎస్.సర్దార్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో కలికిరి సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రాజంపేట మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్.ప్రవీణ్‌కుమార్

కడప లీగల్, జనవరి 29, ప్రభాతవార్త:



ఏపీ హైకోర్టు వారు రాజంపేట మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. ఎస్.ప్రవీణ్‌కుమార్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కడప నందు ప్రస్తుతం పని చేస్తున్నారు. గతంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించడం జరిగింది. ఆ సమయంలో ఎన్నో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్లకు డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించడం, ఆన్‌లైన్ ట్రాన్స్‌జెండర్ల కాలం పెట్టించడం, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను రాష్ట్రంలో ఉత్తమ న్యాయ సేవాధికార సంస్థ మరియు ఉత్తమ పారా లీగల్ వాలంటరీ అవార్డును తెప్పించడంలో కృషి చేశారు.

## కాంగ్రెస్ నాయకుల ఆలోచన తీరు మారాలి

పోరుమామిళ్ల రూరల్, జనవరి 29 ప్రభాతవార్త:

144 సంవత్సరాల తర్వాత జరుగుతున్న మహా కుంభమేళా గురించి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుర్వాఖ్యలు చేయడం సంస్కారహీనమని హిందుత్వ సంస్థల ప్రతినిధులు బి.ఫణి రావు, యు. శ్రీనివాసరెడ్డి, జీ. శ్రీనివాస్, డి. శ్రీనివాసరావు, పి. రాఘవరెడ్డి విలేకరులకు తెలియజేశారు. హిందువుల ఆచార సాంప్రదాయాలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ సందర్భంగా, మూర్ఖంగా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని వారు హితవు పలికారు. గంగలో మునిగితే పేదరికం పోతుందా? అంటూ వ్యంగ్యంగా మాట్లాడడం మహాకుంభమేళా ఆధ్యాత్మికతను ప్రశ్నించినట్లే అవుతుందని, భారతీయతపై ఆయనకు ఉండే ద్వేషము, కసి ఈ వ్యాఖ్యల ద్వారా అర్థమైందని వారు అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఆలోచన విధానాన్ని హిందువులు అర్థం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరేవారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎవరు మాట్లాడినా క్షమించేది లేదని వారు హెచ్చరించారు.

## టిడిపితోనే బీసీలకు సాధికారిత వచ్చిందనడం ఆపద్దం

కాంగ్రెస్ తోనే బీసీ లకు సాధికారిత వచ్చింది.

వేంపల్లె, జనవరి 29, ప్రభాతవార్త :



టిడిపి తోనే రాష్ట్రంలో బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక సాధికారిత వచ్చిందని కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు, మరి కొంత మంది టిడిపి నాయకులు వ్యాఖ్యానించడంలో వాస్తవం లేదని ఏపీసిసి ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి అన్నారు. బీసీలకు రాష్ట్రంలో సాధికారిత కల్పించింది కాంగ్రెస్ పార్టీ.నే అన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 2371970 న జీవో 1793 ద్వారా బీసీ లకు విద్యా, ఉద్యోగాలలో 25 శాతం రిజర్వేషన్లు కల్పించింది అన్నారు. అప్పటికి టిడిపి, బిజెపి, వైకాపా, జన సేన పార్టీలు పుట్టనే లేదు. ఈ జీవో వల్ల లక్షలాది మంది బీసీ లు ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొంది ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తున్నారు. 1987 లో ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించింది వాస్తవం. కానీ 1993లో కోట్ల విజయ భాస్కర రెడ్డి ముఖ్య మంత్రి గా వున్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను34 శాతానికి పెంచింది.దీనివలన లక్షలాది మంది బీసీ లు సర్పంచులుగా,మండల పరిషత్ అధ్యక్షులుగా,జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ లుగా,మున్సిపల్ ఛైర్మన్లు గా,మేయర్లుగా ఎన్నికయ్యారు. 2008 కి ముందు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రమే స్కాలర్ షిప్ పథకం వుండేది. రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా వున్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ లతో పాటు బీసీలకు కూడా ఫీజ్ రీ ఇంబర్స్ మెంటు, స్కాలర్ షిప్ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. దీనివలన లక్షలాది మంది బీసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందారన్నారు. 1968 లోనే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కమీషన్ ఏర్పాటు చేసిందని, 1974 లో బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. కాబట్టి ఏ విధంగా చూసినా బీసీలకు సాధికారిత కల్పించింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు.

## వైద్య సేవలను సద్వినియోగం చేసుకుందాం

పీలేరు, జనవరి 29 ప్రభాతవార్త ః



104సంచార వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవల కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని తలపుల పి. హెచ్. సి. పరిధిలోని చెరుకువారి పల్లి గ్రామం లో నిర్వహిస్తున్న 104 వైద్య సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకవర్ధన్ మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వం దీర్ఘాకాలిక రోగులకు నెలకు సరిపడా మందులు ఈ 104 సేవలలో అందిస్తూ మరియు మినీ ప్రాథమిక సంచార ఆరోగ్య కేంద్రం గా సేవలను అందించడానికి గాను అన్నిరకాల మందులు మరియు ఈ. సి. జి. సౌకర్యం కూడా ఈ వాహనం లో ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. రానున్న రోజులలో ఈ వాహనాలలో మరిన్ని వైద్య సేవలు అనగా రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేసే విదంగా ప్రణాళికలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో తలపుల వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కుంభ మేళా తొక్కిసలాట బాధాకరం

వేంపల్లె, జనవరి 29, ప్రభాతవార్త :



ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో చోటు చేసుకున్న తొక్కిసలాట బాధాకరమని జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ దాసరి రవిశంకర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసరి రవిశంకర్ మాట్లాడుతూ ఈ సంఘటన దురదృష్ట కరమ న్నారు. ఈ ఘటనలో 20 మందికి పైగా చనిపోయారని తెలిసి ఆవేదనకు గురయ్యానని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కుంభ మేళాకు వెళ్ళే భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహా కుంభ సంఘం ఘాట్ వద్ద విపరీతంగా జనం రద్దీతో క్యూలైన్లు లో ఉన్న సమయంలో ఒక్కసారిగా తోపులాట జరగడంతో బారికేడ్లు విరగడంతో ఈ సంఘటన జరగడం బాధాకరమని అన్నారు. కావున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకో వాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన కార్యకర్తలు, నాగ మల్లికార్జున, మహేష్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

## గృహాలబ్ధిదారులకు తక్షణమే స్థలం కేటాయించాలి



బద్వేలు, జనవరి 29, ప్రభాత వార్త

మండల పరిధిలోని గుంతపల్లి గ్రామ ఫలం సర్వేనెంబర్ 948/1, 2,3 958/2 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమిని, ఎన్ టిఆర్ గృహ లబ్ధిదారులకు కేటాయించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు, గోపవరం బద్వేలు మండల రెవెన్యూ అధికారులకు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఉభయ మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి ఓబయ్య, జిల్లా నాయకులు చంద్రశేఖర్ లు మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో సరిహద్దులుగా ఉన్న ప్రకాశం ,నెల్లూరు ప్రాంతాల ప్రజలు ఉపాధి లేక దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బద్వేల్ పట్టణానికి వేల సంఖ్యలో బతుకుతెరువు కోసం వస్తున్నారని, ఇటీవల సెంచరీ పరిశ్రమ ఏర్పాటు అయిన తర్వాత వారి వలసలు మరింత పెరిగాయని తెలిపారు. పట్టణం చుట్టుపక్కల స్థలాల విలువ లక్షల రూపాయలు పలుకు తుండడంతో తాము కష్టం సంపాదించుకున్న ఆ డబ్బును ఆ డబ్బుతో స్థలాలు పనిచేయలేక ఇంటి అద్దెలు చెల్లించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వారిపై వారిని గుర్తించి ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణం చేపట్టి చేపట్టాలని కోరారు. బద్వేల్, గోప వరం మండలాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించాలి ఎన్టీఆర్ గృహ సముదాయాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు జకరయ్య, చంద్రమోహన్ రాజు, ఏరియా నాయకులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కొలతలు తూనికల శాఖ ఇన్స్పెక్టర్ తనిఖీలు

పీలేరు జనవరి 29 ప్రభాతవార్త ః

పీలేరు పట్టణంలోని పలు దుకాణాలలో ఉన్న తూకపు యంత్రాలను తూనికలు కొలతల శాఖకు చెందిన ఇన్స్పెక్టర్ నాగరాజు బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. పట్టణంలోని 45 దుకాణాలలో తనిఖీలు చేసి యంత్రాలను సర్టిపై చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన వారు కూడా ఈ నెలాఖరులోగా తమ యంత్రాలను కొలతలు తూనికల శాఖ వద్ద సర్టిపై చేయించుకోవాలని ఆయన సూచించారు. అలా చేయించుకోని వారిపై దాడులు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన

పోరుమామిళ్ల రూరల్, జనవరి 29 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. శ్రీనివాసులు, సబ్ ఇన్స్పెక్టర్ లు ఆర్.వి. కొండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారి సొంత ఖర్చులతో ఒక ఆటో కు రోడ్డు భద్రత కు సంబందించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, మైక్ లో ప్రజలకు రోడ్డు ప్రమాదాల నుంచి అప్రమత్తంగా ఉండాలని పోరుమామిళ్ల లోని వివిధ కూడళ్ళలో ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని, అతివేగం పనికిరాదని, చిన్న పిల్ల లకు వాహనాలు ఇవ్వొద్దని, స్కూల్ పిల్లల్ని తీసుకొని పోయే బస్సు, ఆటో డ్రైవర్లు తగు జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు. మీరు వాహనాలలో బయలుదేరేటప్పుడు ఒక్కసారి మీ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలని ఒకరికి ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబమంతా బాధ పడతారని ఆ బాధను జీవితాంతం అనుభవించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయండి

పులివెందుల రూరల్, జనవరి 29, ప్రభాతవార్త :

పులివెందుల మునిసిపాలిటీ లో అభివృద్ధిని కొనసాగించడానికి నిధులు మంజూరు చేయాలని పులివెందుల మునిసిపల్ ఛైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు కోరారు. పులివెందుల కు బుధవారం విచ్చేసిన జిల్లా కలెక్టర్ ను వారి కలిశారు. పులివెందుల మున్సిపాలిటీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయిన , ప్రజలకు అత్యంత అవసరమైన యూజీడీ, ఎస్టీపీ, రాణి తోపు రోడ్, శ్మశాన వాటిక, వాటర్ గ్రిడ్ పనులకు నిధులు మంజూరు చేయాలని వారు కలెక్టర్ ను కోరారు. అలాగే రేషన్ పంపిణీ వ్యవస్థ పులివెందుల లో చాలా అధ్వానంగా తయారైందని, పేదలకు అందకుండా డీలర్ ల ఇంటి వద్ద కేవలం రెండు మూడు రోజులు మాత్రమే పంచి పేదల కడుపు కొడుతున్నారన్నారు. వీటి పై చర్యలు తీసుకోవాలి అని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు కార్యక్రమం లో నూర్ బాషా రాష్ట్ర అధ్యక్షులు రసూల్, వైస్ ఛైర్మెన్ హాఫీజ్, కౌన్సిలర్ లు పార్నపల్లి కిషోర్, ఖాదర్, సుంకర రవి తదితరులు పాల్గొన్నారు



## అంతర్‌జాతీయ పోటీలకు పరుశురాముడు ఎంపిక



మదనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త : నేపాల్ దేశంలో జరిగే అంతర్‌జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు టెక్నికల్ అఫిషియల్‌గా కర్నూల్ జిల్లాకు చెందిన పరుశురాముడు ఎంపికైనట్లు అన్నమయ్య జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గౌతమినరేష్ తెలిపారు. ఫిబ్రవరి 1నుంచి 3వ తేది వరకు నేపాల్ దేశంలోని కోసిరాష్ట్రంలోని ఇతహరి పట్టణంలో జరుగుతున్న రెండవ ఏషియన్ షూటింగ్‌బాల్ జట్టుకు ఇతను ఎంపికయ్యాడన్నారు. బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీత్‌రాజ్‌తోమర్ నుంచి ఉ త్తుర్వులు అందినట్లు తెలిపారు. ఎంపికైన పరుశురాముడు ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇండియాలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ హోదాలో ఉన్నట్లు తెలిపారు.

## తహశీల్దార్‌కు రేషన్‌డీలర్లు సన్మానం



నిమ్మనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త : మండల తహశీల్దార్ దనంజనేయులకు తహశీల్దార్ కార్యాలయంలో చౌదుకాణ డీలర్లు ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీదర్‌చే ఉత్తమ అవార్డు పొందడంపై శాలువతో కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో చౌకదుకాణ డీలర్లు ఆర్‌జె.వెంకటేష్, గంగాదర్, ఓబులరెడ్డి, జయరామ్, చలపతి, రెడ్డప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

## శెనగ పంటను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి



యర్రగుంట్ల జనవరి 29 ప్రభాతవార్త మండల క్షేత్ర పరిధిలో రబీ సీజన్లో పండిన శెనగ విత్తనాల ను బుధవారం ఎర్రగుంట్ల మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. పెదలపాడు, తుమ్ములపల్లి గ్రామాలలో పండిన శెనగ పంటను పరిశీలించి పంట ఉత్పత్తి లెక్క కట్టడం కోసం విత్తనాల తూనికలు జరిపారు.

## యువత తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చకండి



తంబళ్లపల్లె జనవరి 29 ప్రభాతవార్త : మండలంలోని యువత డ్రైవింగ్‌లో స్పీడు కాదు క్రమశిక్షణతో కూడిన విద్యలో స్పీడు పెంచాలని యాక్సిడెంట్లు చేసి నమ్ముకున్న తల్లిదండ్రులకు కడుపు కోత మిగల్చరాదని ఎస్ఐ లోకేష్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన తంబళ్లపల్లెమదనపల్లి ప్రధాన రహదారిలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని, రికార్డులు లేని వాహనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ వారిని గుర్తించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారికి హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకమని ప్రాణం పోతే తిరిగి రాదని మీ భార్య బిడ్డలు, తల్లిదండ్రుల పరిస్థితి గుర్తించాలని హితవు పలికారు. భవిష్యత్తులో రోడ్లపై అతివేగం, హెల్మెట్ లేని ప్రయాణం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించరాదని, రికార్డులు సక్రమంగా లేకపోయినా వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత సూచనలను తప్పక పాటించి క్షేమంగా ఇంటికి చేరాలని సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ నజీర్ భాష, హెడ్ కానిస్టేబుల్ శంకర్, గోపాల్, రాజేష్, రమణ, వెంకటేష్, రామిరెడ్డి, రాఘవ, శివారెడ్డిలు ఉన్నారు.

## ఉద్యానవన పరిశోధనలకు భూమి కేటాయించాలి



మైదుకూరు, జనవరి 29, ప్రభాతవార్త: మైదుకూరు బిజెపి నాయకుడు బిపి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జనవరి 18న పర్యటనలో భాగంగా కడప రోడ్డు లో వినతిపత్రం తీసుకోవాలని అర్థించగా తమరు నా వినతి పత్రాన్ని స్వీకరించారని ఆవినతి పత్రంలో నాఫెడ్ సంస్థకు భూమి కేటాయించాలని ఆఫైల్ సీసీఎల్‌ఏ నుంచి రెవెన్యూ శాఖ వద్ద పెండింగులో ఉన్నదని. దీనికితోడు ఉల్లి పరిశోధన కేంద్రం (ఎన్.హెచ్.ఆర్.డి.ఎఫ్) భూమి కేటాయింపు జలవనరుల శాఖ,ఆర్థిక శాఖ వద్ద పెండింగులో ఉన్నదని తెలియజేసుకున్నారు.2007 నుంచి ఈ అంశాలపైన వినతి పత్రాలు,పోరాటాల రూపంలో ఉల్లి రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీసుకెళ్లాం.తదనుగుణంగా పై రెండు సంస్థలకు భూమి కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం ఏపీ ప్రభుత్వానికి ఉత్తరం రాయడం జరిగింది.పై రెండు సంస్థలకు భూమి కేటాయింపు అంశం ఏపీ సచివాలయంలో పెండింగులో ఉన్నది.ఇలా పెండింగులో ఉండగానే నాఫెడ్ కు ప్రతిపాదించి జీవో ఇచ్చిన భూమినే కాపు భవనం కోసం కొత్తగా ప్రతిపాదన తయరవుతున్నది తెలుసుకోవడంతో ఇది ఉల్లి రైతులకు తీరని నష్టం చేకూరుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకని నాఫెడ్, ఎన్.హెచ్.ఆర్.డి.ఎఫ్ లకు భూమి కేటాయించగలరని కోరారు.

## విద్యార్థులు క్రమ శిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

వేంపల్లె, జనవరి 29, ప్రభాతవార్త : విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్ జెడి, ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్ రవి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లిలోని ఉర్దూ కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన మనస్సుతో చాలా మంది కళాశాలకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు అన్నారు. ఉర్దూ కళాశాలలో విద్యార్థుల కోసం ల్యాబ్ కోసం రూ 15 లక్షలను జిల్లా కలెక్టర్ ద్వారా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మంజూరు చేయించారన్నారు. కళాశాలలో ఆహ్లాదకరమైన ఉన్న చెట్లను విద్యార్థులు కాపాడు కోవాలని సూచించారు. విద్యను నేర్చుకోవడానికి కళాశాల దేవాలయం లాంటిదని చెప్పారు. ప్రతి సంవత్స రం శాశ్వతంగా కళాశాలలో టాపర్‌గా వస్తున్న విద్యార్థులకు రూ 3 వేలు ఇస్తా మని రిటైర్డ్ టీచర్ నరసింహారెడ్డి హామీ ఇచ్చారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉర్దూ కళాశాలను నిర్మించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ హబిబుల్లా, కళాశాల కమిటీ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ బాష, ఎఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఇజాక్, వేముల, చక్రాయపేట కళాశాల ప్రిన్సిపాల్ రామ సుబ్బయ్య, రహంతు బాష, టిడిపి యవనేత రజనీకాంత్ రెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి నిసార్ బాషా, కళాశాల కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డి, సాయి పాఠశాల కరస్పాండెంట్ విజయ్ కుమార్ రెడ్డి, లిటిల్ ఫ్లవర్ హెచ్ఎం, టిడిపి నేతలు డాక్టర్ కరీముల్లా, శివ, భాస్కర్, వేమ కుమార్, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, వీరబద్ర, మహబూబ్ బాషా, కళాశాల అధ్యాపకులు, ఉర్దూ పాఠశాల, లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మూగవాడి ఎర్రపల్లి గ్రామంలో పశువుల పండగ



రామసముద్రం, జనవరి29ప్రభాతవార్త మండలంలోని మూగవాడి ఎర్రపల్లి గ్రామంలో బుధవారం పశువుల పండుగలో భాగంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో దీపాల కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదనపల్లి టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్, రాటకొండ మధుబాబు,టిడిపి నాయకులు, పాల్గొన్నారు. వీరికి టిడిపి నాయకులు శివా రెడ్డి, మాజీ టిడిపి మండల అధ్యక్షులు కృష్ణంరాజు, విశ్వనాథ్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.మరియు మహిళలు భక్తి శ్రద్దలతో, ఉపవాస దీక్షలతో గ్రామ దేవతలకు దీపాలు చెల్లించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పశువుల పండుగ సందర్భంగా బంధువులరాకతో గ్రామంలో సందడి వాతావరణం సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో పెద్ద ఆనంద గౌడ్,రెడ్డెప్పరెడ్డి, బాబుసాబ్, అమరప్ప, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయంను తనిఖీ చేసిన ఎంపిడిఓ



రామసముద్రం జనవరి29 ప్రభాతవార్త మండల కేంద్రంలోని సచివాలయంలో ఎంపీడీవో భాను ప్రసాద్ తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీవో భాను ప్రసాద్ సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

## స్కౌట్‌లో జ్ఞానోదయ విద్యార్థుల ప్రతిభ



మదనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త : పట్టణంలోని జ్ఞానోదయ హైస్కూల్ విద్యార్థులు స్కౌట్‌లో ప్రతిభ కనపరచినట్లు కరస్పాండెంట్ కామకోటి ప్రసాద్‌రావు తెలిపారు. భగత్‌సింగ్ స్కౌట్ గ్రూపు తరపున ఎంపికైన స్కౌట్ విద్యార్థులు పి.రెడ్డిప్రసాద్‌రెడ్డి, బి.అర్జున్, డి.నవదీప్, పి.వెంకటేష్‌నాయుడు, బి.రామ్‌చరణ్, వరుణ్‌కుమార్‌రెడ్డి, ఎస్.చెంగల్ రావు, అక్షర, దీక్ష, కళ్యాణి, రుషితలకు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రసంశాపత్రాన్ని అందజేశారు.

## ప్రభుత్వం ద్వారానే సమగ్రాభివృద్ధి




మదనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త : ప్రైవేటు రంగంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటూ పాలకులుచెబుతున్న మాటాలు ఆచరణ సాధ్యం కాదని, ప్రభుత్వం ద్వారానే సమగ్రాభివృద్ధి జరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి- ప్రత్యామ్నాయ విధానాలపై బుధవారం పట్టణంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం 27వ మహాసభలను పురష్కరించుకొని పార్టీ ఈ సదస్సు నిర్వహించిందన్నారు. నాయకులు హరిశర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం అవుతుందని, ఇందుకు జవాబుతారితనం స్పష్టమైన ప్రణాళికలు, నిర్దిష్టిమైన కార్యాచరణ అవసరం అన్నారు. పెట్టుబడి దారులతో ముఖ్యమంత్రి దావోస్ వెళ్ళి ఒప్పందులు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచకుండా ఎన్ని పరిశ్రమలు వచ్చినా ప్రయోజనం ఉండదన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికే కూటమి ప్రభుత్వం నాటకాలు ఆడుతోందన్నారు. ప్రజల సంపద పెరగాలంటే వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగంలో మార్పులు తీసుకురావాలన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రత్యామ్నాయ ప్రణాళికలు మహాసభలో పెట్టి చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజన్న, రఘునాథ్, రామక్రిష్ణ, నాగరాజు, రెడ్డికుమారి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసనలు



మదనపల్లె, జనవరి 29 ప్రభాతవార్త : మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ నాయకులపై చేసిన అసత్య ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నాయకులు నిరసనలు తెలిపారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి వర్రి సురేష్ కుమార్, సహాయ కార్యదర్శి ముభారక్‌లు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కౌన్సిల్‌మీట్‌లో వైస్ ఛైర్మెన్ జింకా చలపతి యూనియన్ నాయకులు కార్మికులకు వేధింపులకు గురిచేస్తున్నారని, డబ్బులు వసూలుచేస్తున్నారని, మాటవినని కార్మికులను విధుల నుంచి తొలగించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పడం భావ్యం కాదన్నారు. వైస్‌ఛైర్మెన్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్య కార్మికుల పక్షాన యూనియన్ పని చేస్తొందన్నారు.

## అన్నదాన కార్యక్రమం

మైదుకూరు, జనవరి 29, ప్రభాతవార్త: మున్సి పాలిటీలోని వనిపెంట రోడ్డు ఎర్ర చెరువు దగ్గర ఉన్న శ్రీశ్రీశ్రీ మోనం స్వామి దేవాలయంలో ఈరోజు అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతేకాకుండా ప్రతి అమావాస్య పున్నమి రోజు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని శిష్య బృందం తెలియజేశారు.శిష్య బృందం ఆధ్వర్యంలో స్వామివారికి పూజా కార్యక్రమాలు చేసి ఆయన ఆశీస్సులు పొందారు. శిష్య బృందం, భక్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హైస్కూల్లో తాగునీటి పైప్‌లైన్‌కు శ్రీకారం



తంబళ్లపల్లె జనవరి 29 ప్రభాతవార్త : కొన్నేళ్లుగా నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మల్లయ్య కొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి తంబళ్లపల్లె హైస్కూల్లో తాగునీటి సమస్యకు తన సొంత నిధులు రూ50 వేలతో పైప్‌లైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎవరికి ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ ఆపద్బాంధవుడిలా కనుగొండ మద్దిరెడ్డి ముందుకు రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని కొనియాడారు. ఈ సందర్భంగా మద్దిరెడ్డిని సన్మానించారు. ఆయన కుమారులు గౌతమ్ రెడ్డి, విక్రమ్ రెడ్డిలను పాఠశాల బృందం, విద్యార్థుల తల్లి దండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి, హై స్కూల్ కమిటీ చైర్మన్ శివకుమార్, హెడ్మాస్టర్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కరీం, మాజీ ఉపసర్పంచ్ మణి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి కృషి చేస్తాం



వాల్మీకిపురం, జనవరి 29 ప్రభాతవార్త : నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ నిర్మాణాలన్నింటినీ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చొరవతో పూర్తి చేస్తామని తెదేపా సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తదితరులతో కలిసి మాట్లాడారు. వాల్మీకిపురం అగ్నిమాపక కార్యాలయ అసంపూర్తి భవనాలను పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు సహకారంతో ఎమ్మెల్యే 15వ ఆర్థిక సంఘం నిధులను రూ 85 లక్షల నిధులను మంజూరు చేయించారన్నారు. మరో మాసం రోజుల్లో టెండర్లను ఆహ్వానించి అగ్నిమాపక భవనాలను పూర్తి చేస్తామన్నారు. అలాగే సిమెంటు రోడ్ల నిర్మాణపనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కోసూరి చంద్రమోళి, గాంధీపేట రమణ, మాజీ సర్పంచి రాజేంద్రచారి, శేషురెడ్డి, పీవీ నారాయణ, బొక్కసం రామకృష్ణ సూయ్యద్ బాషా, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## కూలీల సంఖ్య పెంచకపోతే చర్యలు తప్పవు



తంబళ్లపల్లె జనవరి 29 ప్రభాతవార్త : మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల సంఖ్య పెంచి పనులు కల్పించకపోతే కఠిన చర్యలు తప్పవని ఉపాధి హామీ సిబ్బందిని ఏపీడి మధుబాబు హెచ్చరించారు. బుధవారం ఆయన ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల సమీక్షలో పాల్గొని పంచాయితీల వారిగా ప్రస్తుత పనిచేస్తున్న కూలీలు, జాబ్ కార్డు కలిగి పనులు కల్పించని వారికి పనులు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో వంద రకాలకు పైగా ఉన్న పనులను ప్రతి జాబ్ కార్డు కలిగిన వ్యక్తి కి పని కల్పించి వలస నివారణకు సహకరించాలన్నారు. రేపటి నుండే ప్రతి క్షేత్ర సహాయకుడు గ్రామాలకు వెళ్లి ప్రతి జాబ్ కార్డ్ హోల్డర్ తో కలిసి పనికి రప్పించడానికి కృషి చేయాలని ఇందుకు టెక్నికల్ అసిస్టెంట్లు సహకారం అందించాలని సూచించారు. ఉపాధి హామీలో ఇంకుడు గుంతలు, పురాతన బావుల పూడికతీత, నీటి నిలువ పనులు తోపాటు రైతులకు సంబంధించిన భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులు కల్పించి వేగవంతం చేయాలన్నారు. మండలంలో వచ్చే రెండు మాసాల్లో 3.45 లక్షల పది దినాలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో ఏపీవో అంజనప్ప, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర, శేఖరమ్మ, వెంకటరమణ, నాగార్జున, కార్యాలయ సిబ్బంది రామచంద్ర, ఆయేషా, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## చలో విజయవాడను జయప్రదం చేయాలి



మైదుకూరు, జనవరి 29, ప్రభాతవార్త: పట్టణంలోని కడప రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త పేరు పోగు వెంకటేశ్వర మాదిగ ఆదేశాల మేరకు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మిద్దె వెంకటరమణ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల జాతీయ సమావేశం. ఫిబ్రవరి 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తప్పిట శివ, రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, జిల్లా కన్వీనర్ సంజీవ్, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రామయ్య, దువ్వూరు మండల నాయకులు రవి, గోపి ఓబులేసు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పశుఆరోగ్య శిబిరాలు ప్రయోజనకరం



సుండుపల్లె, జనవరి29,ప్రభాతవార్త: పశు ఆరోగ్య శిబిరాలతో రైతులకు ఎంతో మేలు చేస్తాయని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు (ఏడి) తెలిపారు. బుధవారం మండలంలోని జి రెడ్డివారి పల్లి గ్రామపంచాయతీలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశుఆరోగ్య శిబిరాలతో మండల వ్యాప్తంగా 15 గ్రామపంచాయతీలలో పశువులకు మెరుగైన వైద్యాన్ని అందించినట్లు తెలిపారు. రైతుల నుండి ప్రతి గ్రామపంచాయతీలో విశేష స్పందన లభించిందన్నారు. జి రెడ్డివారి పల్లి గ్రామపంచాయతీలో 1384 గొర్రెలకు వైద్య సేవలు అందజేయడం జరిగిందన్నారు. అలాగే పశువులకు ప్రథమ చికిత్స తో పాటు గర్భకోశ సమస్య గల పశువులకు వైద్యం అందించామన్నారు. 38 దూడలకు వైద్య సేవలు అందించడంతో స్థానిక పశుపోషకులు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వండి

### వైసీపీ పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ భూమి రెడ్డి వంశీధర్ రెడ్డి



ప్రొద్దుటూరు జనవరి 29 ప్రభాతవార్త గత ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని వైసీపీ పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి కోరారు బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్న హామీలు ఎప్పుడు చేస్తామన్న స్పష్టత ప్రజలకు ఇవ్వలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో తల్లికి వందనం మహిళలకు ఉచిత బస్సు ప్రతి మహిళకు 1500 ఆర్థిక సహాయం అంతేకాకుండా ఉద్యోగులకు వ్యాపారులకు మేలు చేస్తామన్న హామీలను ఎప్పుడు అమలు చేస్తున్నారో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన పత్రికా సమావేశంలో మాట్లాడిన తీరు చూస్తే అసలు ఇచ్చిన హామీలు సంక్షేమ పథకాలు అమలు చేస్తారో లేదో అని ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. గత వైకాపా ప్రభుత్వం వల్లే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని తాను అమలు చేస్తానన్న హామీలను అమలు చేయలేకపోతున్నానని మొసలి కన్నీరు కారుస్తున్న వైనం బాధాకరమన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు హామీలు గుప్పించేముందు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి తెలిసి హామీలు ఇవ్వడంలో చంద్రబాబు ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేవలం అధికారం కోసం అమలుగాని హామీలు ఇవ్వడం ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రొద్దుటూరు అభివృద్ధి పథంలో నడిపిస్తానన్న వరద వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్నారు. వరద ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధికై నిత్యం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందని తెలిపారు.

## రాష్ట్రీయ మిలిటరీ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక



చిన్నమండెం, జనవరి 29 ప్రభాతవార్త : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో గల మురళి సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్‌కు చెందిన ఇరువురు విద్యార్థులు రాష్ట్రీయ మిలిటరీ స్కూల్(ఆర్ఎంఎస్) ఎంపికయ్యారు. సోమవారం విడుదలైన మిలటరీ స్కూల్ ఫలితాలలో రాయచోటికి చెందిన మురళి కోచింగ్ సెంటర్ విద్యార్థులు నితిన్ రెడ్డి, రాకేష్ లు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రీయ మిలటరీ స్కూల్ కు ఎంపికయ్యారు. జవహర్ నవోదయ స్కూల్,ఆలిండియా సైనిక్ స్కూల్,రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ ఇలా పోటీ పరీక్షలు ఏవైనా మాకు మేమే సాటి అంటూ రాష్ట్రస్థాయి,జిల్లా స్థాయి ర్యాంకులతో పాటు ఆర్ఎంఎస్ లో కూడా జిల్లా చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఇరువురు మురళి కోచింగ్ సెంటర్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం తమ నివాసం నందు విద్యార్థులను అభినందించారు. పట్టణంలోని విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకొని మరింత బాగా చదవాలని మంత్రి ఆకాంక్షించారు.

## ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేపట్టాలని వినతి



చిన్నమండెం, జనవరి 29 ప్రభాతవార్త : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ బుధవారం చిన్నమండెం మండలంలోని మంత్రి నివాసంలో మంత్రివర్యులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## మొదటి సంతకం ఏమైంది




బద్వేల్ అర్బన్ జనవరి 29 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా మెగా డీఎస్సీ పై చేసిన మొదటి సంతకం హామీ ఏమైందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని విమర్శించారు. బుధవారం బద్వేల్ డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బద్వేల్ రెవెన్యూ డివిజన్ అధికారి ఆర్డిఓకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ ఆనాడు మేము అధికా రంలోకి వస్తే మొదటగా అమలు చేసేది మెగా డీఎస్సీ అని చెప్పి ఎన్నికల ముందు యువతకు హామీ ఇచ్చి నేడు కాలయాపన చేయడం అన్యాయమన్నారు. పలానా రోజు డీఎస్సీ షెడ్యూల్ ఇస్తామని చెప్పి ప్రయత్నం చేయడం లేదని వారు విమర్శించారు. తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే డీఎస్సీ అభ్యర్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్‌కే ఆదిల్ యువరాజ్ పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో ఇద్దరికి రెండేళ్లు జైలు



మదనపల్లెక్రైం, జనవరి 29 ప్రభాతవార్త : ఫోక్సో కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునివ్వటం జరిగిందని రెండవ పట్టణ సిఐ రామచంద్ర తెలిపారు. సిఐ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మదనపల్లె పట్టణం చరణ్, అహమ్మద్‌లు 2022లో ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేశారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి వారిద్దరిని అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి విచారణ జరిగిన ఈ కేసులో చరణ్, అహమ్మద్‌లు నేరం చేసినట్లు ఎపిపి శైలజ కోర్టులో రుజువు చేశారు. దీంతో వారిద్దరికి చేరో రెండేళ్ల జైలుశిక్ష, రూ.4వేల జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పునివ్వటం జరిగింది.

## విద్యార్థులచే వెట్టిచాకరి చేయిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి



మదనపల్లెక్రైం, జనవరి 29 ప్రభాతవార్త : కస్తూరిబా గురుకుల పాఠశాలలో విద్యార్థులచే వెట్టిచాకరి చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎఐఎస్ఎఫ్ బాలికల విభాగం జిల్లా కార్యదర్శి భవిత అధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాధవకుమార్ మాట్లాడుతూ జిల్లాలో 20 కస్తూరిబా గురుకుల విద్యాలయాల్లో ఈనెల 20 నుంచి 23 వరకూ ఆడిట్ చేయటం జరిగిందన్నారు. పిటిఎం, మొలకలచెరువు గురుకుల పాఠశాలల అధికారుల తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదులు చేయటం జరిగిందన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు నిమ్మకు నీరేత్తినట్లు వుండటం అశ్చర్యం కల్గిస్తోందన్నారు. ఇప్పటికైన అధికారులు చర్యల తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ డిటికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నవదీప్, నవ్య, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఊపందుకున్న వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు



తంబళ్లపల్లె జనవరి 29 ప్రభాతవార్త : తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లి పంచాయతీలో తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ సూచనలతో పిఠ కాజా మొహిద్దిన్ ఆదేశాలతో వాటర్ షెడ్ అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. మండలంలో ఎక్కడా లేని విధంగా గుండ్లపల్లి పంచాయతీలోని చంద్రాయుని చెరువు నిండడం విశేషం. ఇదే స్ఫూర్తితో పంచాయతీలో భూగర్భ జలాలు పెంపుకు ఇంకుడు గుంతలు, మట్టి కుంటలు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. వాట్ షెడ్ పనులు వేగవంతానికి మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ నాయుడు, చెరువు సంఘం అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, టిడిపి నాయకులు కాలా నారాయణ, పెద్ద వీరభద్ర, జనసేన నాయకుడు సిద్ధమల్ రెడ్డి, మధు, జైపాల్ నాయుడు,ఎమ్మార్పీఎస్ నాయకుడు వేటా మల్లికార్జున, సహకరిస్తున్నట్లు వాటర్ షెడ్ అధికారి ఆంజనేయులు తెలిపారు.

# పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?



### తాసిల్దార్‌పై జగన్మోహన్ రాజు ధ్వజం

రాజంపేట అర్బన్, జనవరి 29 ప్రభాతవార్త

వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించుకొన్న పెద్దలకు ఒక న్యాయం తమభూమి పక్కనే ఉన్న కొంచెం భూమిలో పాటలు సాగు చేస్తే ఆక్రమణలు, రూల్స్ గుర్తుకొస్తాయని రాజంపేట తాసిల్దార్‌పై తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు ధ్వజ మెత్తారు. సామాన్యుల ఫిర్యాదులకు నో యాక్షన్ అని,టిడిపి వారైతే చాలు ఎక్కడలేని యాక్షన్ అని,పేదలకుఒక న్యాయం, పెద్దలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు.పేదలంటే చాలు ఆమెకు గిట్టదని, పేదలు ఎక్కడైనా ఒక్క సెంటు ఆక్రమించుకుంటే ఆమెకు ఎక్కడ లేని రూల్స్ గుర్తొస్తాయని, తెలుగుదేశం కార్యకర్తలు, సామాన్య ప్రజలు అయితే రాజంపేట తాహసిల్దార్‌కు నిబంధనలు గుర్తొస్తాయని, అందుకే పేదల నోటి కాడ కూడు తీస్తూ చిన్న చిన్న రైతులను ఎటువంటి నోటీసులు లేకుండా వారు సాగు చేసుకునే పంటలను ధ్వంసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాజంపేట మండలం శేషమాంబపురంలో టిడిపి కార్యకర్త సంగరాజు వెంకటసుబ్బమ్మ సాగు చేసుకుంటున్నా 133 సర్వేనెంబర్ 3.09 సెంట్ల భూమిలో 800 బొప్పాయి మొక్కలను ఎటువంటి సమాచారం లేకుండా రెవిన్యూ అధికారులు ధ్వంసం చేయడంపై చమర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శేషమాంబపురంలో ఆయన పర్యటించి టిడిపి కార్యకర్తను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట మండలంలో భారీగా భూములు దోచుకు తిన్న బడా నాయకులు జోలికి వెళ్లకుండా, ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోకుండా, కళ్ళ ముందరనే కబ్జాలు కనిపిస్తున్న చర్యలు తీసుకునేందుకు రాజంపేట తాసిల్దార్‌కు తీరిక లేదని, కేవలం తమ సొంత భూమిలో పక్కన కొంచెం సాగు చేసుకునేందుకు సాగు చేసుకున్న భూమితో పాటు తమ పట్టా ల్యాండ్‌లో ఉన్న స్తంభాలన్నిటిని ధ్వంసం చేయడంపై మండిపడ్డారు. రాజంపేట తాసిల్దార్ ఒక పార్టీకి ఏజెంట్గా పనిచేస్తుందని అర్థమవుతుందని, చెరువులు కుంటలు ఆక్రమించారని ఆధారాలతో సహా ఇస్తే నోటీసులు ఇచ్చి గడువు ఇచ్చారని, కోట్ల రూపాయల విలువైన భూముల దోచుకున్న నోటీసులు ఇచ్చే అధికారులు మరి తమ పొలం పక్కన కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటే ఎందుకు పూర్తి పంటను ధ్వంసం చేశారు అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు. రాజంపేట మండల రూరల్ టిడిపి అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు. ఉపాధ్యక్షుడు సతీష్ రాజు. మాజీ టిడిపి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేవూరి వేణుగోపాల్. శేషమాంబపురం టిడిపి నాయకులు సూర్యనారాయణ రాజు. రవీంద్ర రాజు. వెంకట సుబ్బరాజు. వెంకటరామరాజు. తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి. పాండురాజు. తేజాల ఆనంద్. మల్లికార్జున రాజు. నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# పులివెందుల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష

పులివెందుల, జనవరి 29, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణ అభివృద్ధి పనుల మరియు పెండింగ్ పనులను పరిశీలించడానికి బుధవారం జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పులివెందులలో పర్యటించారు. పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం నందు స్థానిక తెదేపా నాయకులతో కలిసి పులివెందుల ప్రాంత అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ముఖ్యంగా భూగర్భ డ్రైనేజ్, తాగునీటి సమస్య, పెండింగ్ లో ఉన్న రోడ్ల పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరేలా చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు కావడానికి మా వంతు కూడా కృషి చేస్తామని కలెక్టర్ ను కోరారు. ముఖ్యంగా ఈ ప్రాంత రైతులకు ఉపయోగపడే అరటి కోల్డ్ స్టోరేజ్ ను , అలాగే రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న శ్రీరామ హాల్ రోడ్డును వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి విషయంలో త్రాగునీరు సరైన పద్ధతిలో వదలకుండా మా ప్రభుత్వంపై చెడ్డ పేరు వచ్చేలాగా ఉద్యోగులు ప్రవర్తిస్తున్నారని గతంలో ఎన్నడూ లేని సమస్యలు నేడు ఉన్నట్లుగా చూపిస్తున్నారని, మధ్యనే సమ్మర్ స్టోరేజ్ పనులు కూడా పూర్తి చేయించామని సమస్యలు పునరావతం కాకుండా సంబంధిత అధికారులకు సూచించాలని కోరారు. అనంతరం పులివెందుల మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు గురించి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పట్టణ పరిధిలోని బాకరాపురం వీధి నందు మోకాళ్ళ లోతు తవ్వి రోడ్డు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అలాగే ఆ వీధి వాసుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యతను బట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



మౌళిక వసతులు కల్పించండని బీటెక్ రవికి మొర పెట్టుకున్న భాకరా పురం వాసులు :

పులివెందుల అభివృద్ధి పనులను పరిశీలించడానికి బుధవారం జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పర్యటించనున్న నేపథ్యంలో పట్టణ పరిధిలోని భాకరాపురం నందు పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పరిశీలించడానికి వెళ్లిన నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్‌రవి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డిలకు భాకరాపురం వాసులు మాకు మౌలిక సదుపాయాలు కల్పించండని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు రెండు సంవత్సరాలుగా భూగర్భ డ్రైనేజ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, మోకాళ్ళలోతు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని వీధి దీపాలు కూడా వెలగని పరిస్థితి అని మా వీధి నందు మౌలిక సదుపాయాలన్నిటిని ఏర్పాటు చేయాలని మొరపెట్టుకున్నారు. ఇందుకు బీటెక్ రవి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్‌రెడ్డిలు స్పందించి సమస్యలను కలెక్టర్ మరియు ప్రభుత్వ దృష్టికి త్వరితగతిన తీసుకెళ్లి పనులు పూర్తయ్యేలా చేస్తానని స్థానిక వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు, మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొరియర్ ప్రసాద్‌రెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# పాడి రైతుల అభివృద్ధి హెరిటేజ్ ఫుడ్స్ లక్ష్యం





పీలేరు జనవరి 29 ప్రభాతవార్త ః

పాడి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయడం, వారి స్థిరాభివృద్ధిని ప్రోత్సహించడంలో హెరిటేజ్ ఫుడ్స్ అంకితభావంతో పనిచేస్తోందని ఆ సంస్థ వైస్ చైర్ పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి తెలిపారు. బుధవారం పీలేరు పట్టణ శివారులోని శ్రీకృష్ణదేవరాయ నూనెవిత్తుల కర్మాగారం సమీపంలో ఉన్న హెరిటేజ్ ప్లాంట్ లో జరిగిన పాడి రైతుల మహాసదస్సు కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మెగా హెల్త్ క్యాంపుతో పాటు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన రైతు సదస్సులో మాట్లాడుతూ ప్రస్తుతం తమ సంస్థ రోజువారీ 9,000 గ్రామాల్లో 3 లక్షల మంది పాడి రైతుల నుంచి 18.5 లక్షల లీటర్ల పాలను 200 చిల్లింగ్ యూనిట్లకు చేరుతున్నాయని అన్నారు. ఇందులో ఒక్క చిత్తూరు జిల్లాలోనే 30 వేల మంది పాడి రైతుల నుంచి 2.5 లక్షల లీటర్ల పాలను జిల్లా పరిధిలోని 10 చిల్లింగ్ యూనిట్లకు అందుతున్నాయని చెప్పారు. అదేవిధంగా పీలేరు చిల్లింగ్ సెంటర్ కు ప్రస్తుతం 250 గ్రామాల నుంచి 3,000 మంది రైతులు 35 వేల లీటర్ల పాలను అందిస్తున్నారని, దీన్ని 50,000 మంది పాడి రైతుల నుంచి 50 వేల లీటర్ల పాలను సేకరించే సామర్థ్యానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రైతుల భద్రత కోసం గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ బీమా, సబ్సిడీపై పశువుల భీమా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు వీలుగా రైతులకు సబ్సిడీపై పశువుల దాణా కూడా సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం పాల ఉత్పత్తులను పెంచడంలో ఆసక్తి చెబుతున్న మహిళ ఆడి రైతులకు జ్ఞాపికలు అందించి అభినందించారు. అనంతరం రుణాలుగా రూ.18.35 లక్షలు, బీమా సొమ్ము రూ.21.44 లక్షలు చెక్కుల రూపంలో మహిళా పాడి రైతులకు అందించారు. పీలేరు ప్రాంతంలో పాల నాణ్యతను మెరుగుపరచడం, ఆధునిక పశుసంవర్ధక పద్ధతులను ప్రోత్సహించడానికి టెక్నో సర్వ్ తో భాగస్వామ్యం చేసుకుంటూ తీర్మాన ఫత్రాలను మార్పు చేసుకున్నారు. ఈ సహకారం పశువుల పాల దిగుబడి అభివృద్ధి, రైతుల ఆదాయాన్ని పెంచడంలో దోహదపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ ఫుడ్స్ ప్రతినిధులు సాయి మూర్తి, రామ్మోహన్ రావు, గోపాలకృష్ణ, అక్కిరాజు చంద్రమోళి, చంద్రశేఖర రావు, సర్వోత్తమ రెడ్డి, డాక్టర్ దత్త చారి, డాక్టర్ వివిన్ రామకృష్ణ లతో పాటు టెక్నో సర్వ్ ప్రతినిధి జయదీప్, భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సెల్వరాజ్, హెరిటేజ్ ఉద్యోగులు, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

### వైభవంగా ప్రారంభమైన

## అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు

బద్వేలు అర్బన్, జనవరి 29, ప్రభాతవార్త:



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని మూడు రోజుల పాటు పలు రకాల ప్రత్యేక పూజలను ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవీ.సుబ్బారావు, సెక్రటరీకొలిశెట్టి నాగరాజ, జాయింట్ సెక్రటరీలు సగళాసురేష్‌బాబు, వైభవ్ ప్రసాద్, ట్రెజరర్ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్లుదర్శి వెంకటేశ్వర్లు, మునగా చలమయ్య, మరియు పలువురి కమిటి సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణలమధ్య వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం శ్రీ ఆర్యవైశ్య మహిళా మండలి వారిచేదాతల సహకారంతో నూతనంగా అమమవారికి చేపట్టిన ముత్యాల చీర, ఆవోపా మహిళా విభాగం వారిచే దాతల సహకారంతో చేయించిన వెండి కలశం చెంబు, వెండి హారతిపల్లెం, వెండి శటారు, అలాగే ఆర్యవైశ్య యువజన సంఘం వారిదాతల సహకారంతో అమ్మవారికి చేయించిన వెండి పాశంకుములను ప్రత్యేక బ్యాండు మేళ, తాళాలతో శ్రీ మహాలక్ష్మిదేవాలయం నుంచి అమ్మవారిశాలకు తీసుకు వచ్చి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సమర్పించారు. వీరికిమహాలక్ష్మి దేవాలయం ఆలయ అధ్యక్షులు పీవీన్. ప్రసాద్, కొలిశెట్టి రమేష్, పలువురు కమిటి సభ్యులు మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవీ.సుబ్బారావు, సెక్రటరీకొలిశెట్టి నాగరాజలు మాట్లాడుతూ ఆర్యవైశ్య కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్నిమూడు రోజుల పాటు బద్వేలు పట్టణంలో వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, కావున పట్టణ పరిసర ప్రాంతాలలోపాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. బుధవారం వాసవిమాత అమ్మవారు మొదటిరోజు ప్రత్యంగిరదేవి అలంకారంతో పలువురు భక్తులకు దర్శనమిచ్చారు. సాయం సంధ్యావేళ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారినిదర్శించుకుని అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షరాలుదేవతి లలిత, స్టేట్ ఉపాధ్యక్షులు కొండపల్లి దేవి, వనితాక్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, కుప్పం శర్వాని, వల్లంకొండు ధనలక్ష్మి, కొప్పరపు లత, తులసి వరలక్ష్మి, బచ్చు పార్వతమ్మ, గంగిశెట్టి ధనమ్మ, వందవాసి ధనమ్మ,మెంటా లక్ష్మినారాయణమ్మ, అవోపా మహిళా విభాగ అధ్యక్షురాలు సముద్రాల మాధవి లత, పెసల శ్రీవాణి, సుప్రజ, జూటూరు పద్మలత, తులసి లక్ష్మిదేవి, చింతకుంట సుభాషిణి, పెసల సుధాకర్, కొలిశెట్టి వెంకటసుధ, రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయ్ చింతకుంటక్రిష్ణమూర్తి, వల్లంకొండు శారద, గంగిశెట్టి ధనమ్మ, పుట్టా రాజేశ్వరమ్మ, రాజా వెంకటేశ్వర్లు, దేవతివెంకటసుబ్బారావు,తులసి వెంకటసుబ్బయ్యతో పాటు ఆర్యవైశ్య వర్తక సంఘం,యువజన సంఘం, మహిళామండలి తదితరులు పాల్గొన్నారు







## కోసువారిపల్లెలో వైభవంగా రాజగోపుర ప్రతిష్ట

తంబళ్లపల్లె జనవరి 29 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె శ్రీ ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో రాజగోపుర ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. బుధవారం టిటిడి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, నగేష్ ఆధ్వర్యంలో రాజగోపుర ప్రతిష్ట కార్యక్రమానికి అంకురార్పణ టిటిడి ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టార్, రమేష్ బాబు, ధనుష్ లు చేపట్టి స్వామివారికి ఆకు పూజ, పుష్పాభిషేకం, ప్రత్యేక అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమం వీక్షించడానికి కోసువారిపల్లి ప్రజలతోపాటు మండలంలోని పలు

## అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం





బద్వేలు అర్బన్, జనవరి 29 ,ప్రభాతవార్త:

జాతీయ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బద్వేలు పట్టణంలోని రెవెన్యూ శాఖలో ప్రజలకు నిరంతరాయంగా సేవలందించిన ఆర్డీవో చంద్రమోహన్, బద్వేలు, అట్లూరు, గోపవరం మండల పరిధిలో ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు తావు లేకుండాప్రజలలో మేకమై నిరంతరాయంగా పోలీసు సేవలందిస్తున్న సీఐ నాగభూషణ్ బద్వేలు మున్సిపాలిటీని అత్యంతపరిశుభ్రంగా ఉండేలా తెల్లవారుజామునుంచి రాత్రి వరకు మున్సిపల్ కార్మికులతో పట్టణాన్ని పరిశుభ్రం చేయిస్తూమున్సిపాలిటీలో నీరు, పారిశుద్ధ్య సమస్య లేకుండా నిరంతరాయంగా సేవలందిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిబద్వేలు మండల పరిధిలో ప్రజలకు సేవలందిస్తున్న ఎంపీడీవో దుంపల మల్లేశ్వరితో పాటు పాటు పలుశాఖలఅధికారులకు వారి సేవలను గుర్తించి కడపలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, అవార్డులు పొందిన పలు శాఖాదికారులను యోగివేమన యూనివర్సిటి ఈసీ మెంబర్ కొండపల్లి చిన్న సబ్బారావు, ఆవాజ్‌కమిటి అధ్యక్షులు సత్తార్, రసూల్, కేశవయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ పూలమాలలతో సత్కరిస్తూ వారిసేవలను కొనియాడారు. భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు, ప్రశంసా పత్రాలు పొందాలని ఆకాంక్షించారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన కుప్పాల



సిద్దవటం, జనవరి 29, ప్రభాతవార్త:

కడప జిల్లాకు నూతన ఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఈజీ అశోక్‌కుమార్ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య ఎస్పీ కార్యాలయంలో పూల బొకే, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కుప్పాల మాట్లాడుతూ సిద్దవటం మండలం పరిస్థితులను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అలాగే సిద్దవటానికి ఎస్సైని నియమించాలని ఎస్పీని కోరినట్లు కుప్పాల వెంకట సుబ్బయ్య తెలిపారు.

### పోలీసుల పహారాలో

## ముగిసిన సర్వసభ్య సమావేశం



గాలివీడు, జనవరి 25(ప్రభాతవార్త):

పోలీసుల పహారాలో ఉత్కంఠ నడుమ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ అధ్యక్షతన కేసులు నమోదు చేసి జైలుకు పంపిన ఎంపీడీఓ జవహర్‌బాబును తక్షణమే బదిలీ చేయాలని ఎంపీపీ పద్మావతమ్మ అనుమతితో ఎంపీటీసీ సభ్యుడు గడ్డం చంద్రారెడ్డి ప్రతిపాదించగా అందుకు సభ్యులు మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. ఇదే విషయమై స్పందించిన ఎంపీడీఓ జవహర్‌బాబు కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై సమావేశంలో చర్చించడం సరికాదంటూ ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం అభివృద్ధి, ప్రజా సమస్యలపై శాఖల వారీగా పురోగతిపై సభ్యులు ప్రశ్నించగా శాఖల వారీగా అధికారులు సమాదానమిచ్చారు. అందులో ముఖ్యమైన సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన విద్యుత్, ఆర్ అండ్ బీ, వాటర్ షెడ్, పారెస్ట్, ఎక్సైజ్, ఆర్టీసీ శాఖల అధికారులపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా అధికారులకు పిర్యాదు చేయాలని సభ్యులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. నూతనంగా మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ఏర్పాటుకు వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి ప్రతిపాదనలు చేయగా అందుకు సభ్యులు మద్దతు పలికారు. పట్టణంలోని గుర్రాలమిట్ట వద్ద ఆర్అండ్‌బీలో రేకుల షెడ్ల ఏర్పాటుతో ప్రమాదాలు పొంచి ఉన్నందున వెంటనే చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఇంకా అగ్రికల్చర్, ఐసీడీఎస్, వెలుగు, రెవెన్యూ, విద్యుత్, ఉపాధి, వెల్ఫేర్, హార్టికల్చర్, హౌసింగ్, విద్య, వైద్యం చర్చించారు. ఇదిలా ఉండగా గాలివీడు మండలంలో 14 మంది ఎంపీటీసీ సభ్యులు, 17 మంది సర్పంచులు ఉండగా అందులో 1 సర్పంచ్, 3 మంది ఎంపీటీసీలు టీడీపీ వారు కాగా మిగిలిన సభ్యులందరూ వైసీపీ పార్టీకి చెందిన వారు కావడంతో సమావేశంలో గొడవలు జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు, గత నెల 27వ తేదీన ఎంపీడీఓపై జరిగిన దాడి దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా మండల సర్వసభ్య సమావేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, 6 మంది ఎస్ఐలు, 100 పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్ వీడియో కెమెరాలతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి సొంత డబ్బు 10 వేలు క్యాష్ బహుమతి



రాయచోటి, జనవరి 29 ప్రభాతవార్త

రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం బైపీసీలో 440 మార్కులకు గాను 436 మార్కులు సాధించిన షేక్ అరీఫుల్లా కు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తమ సొంత నిధులు 10000 రూపాయల క్యాష్ బహుమతి అందజేశారు. బుధవారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే 92 వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థుల ను మరింత ప్రోత్సహించేందుకు వారికి గ్యాస్ బహుమతులు ప్రకటించారు. వచ్చే ఏడాది ఎంపీసీ బైపీసీ గ్రూపులలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మరిన్ని క్యాష్ బహుమతులు తమ సొంత డబ్బు ఖర్చు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యాభివృద్ధిలో రాయచోటి నియోజకవర్గం వర్గానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు వీళలు, చప్పట్లతో కళాశాల ప్రాంగణం మారు మ్రోగే విధంగా విద్యార్థులు తమ ఉత్సాహాన్ని చూపారు.

## నాసిరకంగా తారు రోడ్డు పనులు

సిద్దవటం, జనవరి 29, ప్రభాతవార్త:

సిద్దవటం మండలంలోని జ్యోతి, వెంకటాయపల్లె ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. నాసిరకంగా తారు రోడ్డు పనులు చేపట్టడంతో రోడ్డు నెర్రలు బాట పట్టాయి. జ్యోతి, గొల్లపల్లె సమీపాన రహదారి దెబ్బతింది. పనులు చేపట్టడానికి గుత్తేదారుడు రూ.40లక్షలు పనులు చేపట్టినా పూర్తిగా రహదారి పనులు చేపట్టకుండా ఉండడంతో గుంతల మయంగా రహదారి దర్శనమిస్తోంది. ఇదే రహదారిన పలు గ్రామాలకు ప్రజలు ప్రయాణిస్తూ ఉంటారు. తారురోడ్డు వేసిన పది రోజులకే రోడ్డు దెబ్బతినడంతో నాణ్యత లోపం వల్ల రహదారి దెబ్బతిందని పలువురు వ్యక్తం చేశారు. దెబ్బతిన్న తారు రోడ్డు పనులపై ఆర్అండ్‌బీ ఏఈ గంగిరెడ్డి వివరణ కోరగా పరిశీలించి తారు రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాలలో పనులు చేపట్టి నాణ్యత లోపాలు గుర్తిస్తామన్నారు.



### జగన్ చేసిన అప్పుల వల్లే

## సంక్షేమ పథకాలు అమలు చేయలేని దుస్థితి

ప్రొద్దుటూరు, జనవరి 29, ప్రభాతవార్త

గత వైసిపి ప్రభుత్వ పాలనలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అప్పుల వల్లే ప్రస్తుతం రాష్ట్రం లో సంక్షేమ పథకాలు అమలు చేయలేని దుస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విపరీతమైన అప్పులు చేశారు కానీ, ఆ అప్పులకు తగ్గ ఆస్తులు కూడబెట్టలేదని, 10లక్షల కోట్లు అప్పుకు 72 కోట్ల రూపాయలు వడ్డీ అసలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ గతంలో చేసిన అప్పుల వలన సంక్షేమ పథకాలు అమలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. వివిధ పనుల కోసం అమినిటీస్ కొరకు వేల కోట్లు వెచ్చించారని, ఇప్పటికీ కాంట్రాక్టర్లు చేసిన పనులకు డబ్బులు చెల్లించి లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బకాయిలు చెల్లిస్తేనే కొత్త అప్పులు రాష్ట్రానికి వచ్చే పరిస్థితి వుందన్నారు. నిరంతరం రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. వైసిపి హయాంలో విపరీతమైన దోపిడీ జరిగిందని అందుకే ప్రజలు వైసిపి కి బుద్ధి చెప్పారని వివరించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 7 నెలలు అయిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలు గమనించాలని తెలిపారు. సంవత్సరానికి 70 లక్షల కోట్ల రూపాయలు వడ్డీ అసలు చెల్లించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులు, వైసిపి హంగుల కోసం వేల కోట్లు వెచ్చించారని విమర్శించారు. 19 వేల కోట్ల రూపాయల పైచిలుకు ప్రజల డబ్బును వైసిపి ప్రభుత్వం దుబారా చేసిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే 3 వేల రూపాయలు పెన్షన్ 4 వేలకు పెంచడంతో పాటు కేవలం సచివాలయ వ్యవస్థను ఉపయోగించి పెన్షన్ పంపిణీ చేశామని వివరించారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. రానున్న 3 సంవత్సరాలలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు పరిశ్రమలను ఏపీకి ఆహ్వానించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిల్ కుమార్, కమాల్ భాష మాజీ కౌన్సిలర్లు తలారి పుల్లయ్య, జంబాపురం రామాంజనేయ రెడ్డి, నాయకులు ఘంటసాల వెంకటేశ్వర్లు, పల్లా శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## అసంపూర్తి పనులు పూర్తి చేయండి

వేంపల్లె, జనవరి 29, ప్రభాతవార్త :

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ బిటెక్ రవి, వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, కన్వీనర్ రామమునిరెడ్డి లతో కలిసి అసంపూర్తి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పనులకు సంబంధించి వివరాలను అధికారులతో తెలుసుకున్నారు. అంతకు ముందు స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద బిటెక్ రవి, రఘునాథ్ రెడ్డి, రామమునిరెడ్డి కలెక్టర్ కు ఘన స్వాగతం పలికారు. అలాగే పుష్పగుచ్ఛం అందజేశారు. అంతేకాకుండా బిటెక్ రవి, నాయకులు, కార్యకర్తల ద్వారా మండల పరిధిలోని వివిధ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించి, వెంటనే పరిష్కరించాలని బిటెక్ రవి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హై లెవల్ కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి, పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, రోడ్డు భవనాల శాఖ ఇఇ మాధవి, డీఇ వేణుగోపాల్, ఏఇ మనోహర్ రెడ్డి, పిఆర్ డీఇ సుధాకర్ రెడ్డి, ఏఇ శ్రీనివాసులు, పంచాయతీ ఇఓ సుబ్బారెడ్డి, సిఐ సురేష్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, టిడిపి సీనియర్ నేతలు మహమ్మద్ షబ్బీర్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, పివి రమణ, కొండయ్య, శేషారెడ్డి, రజనీకాంత్ రెడ్డి, వేమాకుమార్, డక్కారమేష్, మహమ్మద్, జబిబుల్లా, మడక శ్రీను, మల్లికార్జున, అల్లాబకష్, షరీఫ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



